క్లుప్తంగా

క్షేత్రదేవత ఆలయం ముస్తాబు



రాజగోపురానికి మామిడి తోరణాలు కడుతున్న సిబ్బంది

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీకుంకుళ్లమ్మ ఆలయం శ్రావణ శోభను సంతరించుకుంది. శుక్రవారం నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండటంతో గురువారం సిబ్బంది ఆలయాన్ని ముస్తాబు చేశారు. అందులో భాగంగా రాజగోపురానికి, ద్వారాలకు మామిడి తోరణాలు కట్టారు. ప్రతి శుక్రవారం అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే వచ్చేనెల 8న ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామన్నారు.

కోదండ రామాలయంలో పూజలు



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురంలో ఉన్న కోదండరామాలయంలో రామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం స్వామి వారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రం సందర్భంగా పంచలోహ ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకాలు, నీరాజనం మంత్ర పుష్పాలు అర్చకులు మద్దూరి వంశీకృష్ణ శర్మ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మోతుకూరి నారాయణవవ్వ, సరోజిని దంపతులు, ఉపాధ్యక్షుడు వరికూటి ధర్మారావు, కార్యదర్శి కోరా రఘురామ్, కోశాధికారి కొప్పరవు డీఎస్‌వీఆర్ సురేష్, సత్య దంపతులు, కొప్పరపు రాము, ప్రమీల దంపతులు, సందీప్, మోటమారి గణేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో కొలువైన దత్తాత్రేయునికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు చేసి, సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు



ద్వారకాతిరుమల: ఆషాఢమాసం ముగింపును పురస్కరించుకొని స్థానిక తూర్పు వీధిలో కొలువైన శ్రీ గంగానమ్మ అమ్మవారికి నాయీ బ్రాహ్మణులు గురువారం పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ముందుగా వారు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి అట్టహాసంగా చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి పూజాధికాలు నిర్వహించి, పసుపు, కుంకుమలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాదంబరి అలంకరణలో కనకదుర్గమ్మ



కొయ్యలగూడెం: ఆషాఢమాస అమావాస్య సందర్భంగా ఆలయాల్లో గురువారం విశేష పూజలు నిర్వహించారు. కన్నాపురం శ్రీదుర్గా భవాని రసలింగేశ్వర స్వామి ఆలయంలో కనకదుర్గమ్మను కాదంబరి పుష్పాలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. విశేష సహస్ర కుంకుమార్చన అమ్మవారికి నైవేద్యాలు పెట్టారు. ఆలయ అర్చకులు చిట్టా ప్రగడ మణికంఠ శర్మ ఆధ్వర్యంలో రసలింగేశ్వర స్వామికి అమావాస్య ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. కొయ్యలగూడెంలోని శ్రీమీనాక్షి సుందరేశ్వర స్వామికి విశేష పూజలు, కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహించారు.

అమ్మవారికి పల్లకీ సేవ

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మ పల్లకీ సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మాస శివరాత్రిని పురస్కరించుకొని శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి జంగారెడ్డిగూడెం పట్టణంలో మేళతాళాలు నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహణరావు, రామిశెట్టి శ్రీనిఆవసరావు, మారిశెట్టి అంజనకుమార్, గుడిమెట్ల యుగంధర్ పాల్గొన్నారు.

వర్షాకాలం.. పశువులు భద్రం

- జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు
- పాల దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం
- పశువులు వ్యాధుల బారిన పడే ప్రమాదం



పశువుల కోసం పరిశుభ్ర వాతావరణం ఉండేలా ఏర్పాటు చేసిన షెడ్డు



పశువులకు టీకా వేస్తున్న పశు వైద్యులు (ఫైల్)

జంగారెడ్డిగూడెం: వర్షాకాలంలో పశువులు అనేక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఎక్కువ. ఈ వ్యాధులు పశువుల ఆరోగ్యాన్ని, ఉత్పాదకతను దెబ్బతీస్తాయి. కాబట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశు వైద్యాధికారి బీఆర్ శ్రీనివాసన్ మాటల్లో.. పశువులకు వ్యాధులు రాకుండా శుభ్రమైన నివాసం ఏర్పాటు చేయాలి. పశువుల శాలను పొడిగా, శుభ్రంగా ఉంచడం, నేలపై గడ్డి లేదా ఎండు గడ్డి పరచడం, పశువుల మల మూత్రాలను తరచూ తొలగించడం, గోడలకు సున్నం వేయించడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా వైరస్‌లు, రోగ కారక క్రిములు వ్యాప్తి చెందకుండా చూసుకోవచ్చు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం ఇవ్వడం ద్వారా కూడా వ్యాధులను అరికట్టవచ్చు. పొడి మేత ఎక్కువగా ఇవ్వడం, తడిసిన లేదా బూజు పట్టిన మేతను పారవేయడం, శుభ్రమైన తాగునీరు అందించడం, ఖనిజ లవణ మిశ్రమాన్ని ఇవ్వడం వంటి చర్యలు పశురైతులు తీసుకోవాలి.

బ్యాక్టీరియా నివారణకు క్రిమి సంహారక మందులు

పరాన్న జీవుల నివారణకు షెడ్లు, పశువుల నివాసిత ప్రాంతాల్లో నియమిత కాలాల్లో క్రిమి సంహారక మందులు జల్లాలి. పశువుల శరీరాన్ని శుభ్రంగా ఉంచాలి. గోమార్లు, పేలు వంటి బాహ్య పరాన్న జీవులను తొలగించాలి. అలాగే ముఖ్యమైన వ్యాధులకు (ఖురపకం, గాలికుంటు, అంతర్గత పరాన్నజీవుల వ్యాధి) టీకాలు వేయించాలి. నిరంతరం పశు వైద్యుడి సలహాలను పాటిస్తూ పశు పోషణ చేయాలి. పశువులు అనారోగ్య లక్షణాలతో బాధపడుతుంటే, వ్యాధి లక్షణాలు గమనించాలి. పశు పోషకులు రోజూ పశువుల దైనందిన ప్రక్రియలో మార్పులు గుర్తించాలి. అనగా తినకపోవడం, విరేచనాలు, దగ్గు వంటి తదితర లక్షణాలను గమనించినా, లేదా ఏదైనా అసాధారణ లక్షణాలు కనిపించినా వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలి. అదే విధంగా పశువుల శాల చుట్టూ నీరు నిలవకుండా చూసుకోవడం, దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం, చెత్తను సరిగ్గా తొలగించడం వంటి వాటి వలన వ్యాధులు దరిచేరవు.

పోషకాల మేత ముఖ్యం

పశువులకు ఇచ్చే మేతను పొడి ప్రదేశంలో నిల్వ చేయాలి. బూజు పట్టకుండా జాగ్రత్త వహించాలి. చూడి పశువులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం, పాలిచ్చే పశువులకు అదనపు పోషకాహారం అందించడం ద్వారా వ్యాధులు దరిచేరవు. ఒక వేళ వ్యాధులు సంభవిస్తే పశువుల శాలలో క్రిమి సంహారకాలు చల్లడం, పశువులను తడవకుండా చూసుకోవడం వంటి రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ జాగ్రత్తలు పాటించడం వలన వర్షాకాలంలో వచ్చే అనేక వ్యాధులను నివారించవచ్చు. దీనివల్ల పశువుల ఆరోగ్యం మెరుగు పడి, పశు పోషకులకు లాభం చేకూరుతుంది.

వర్షాకాలంలో వరి గడ్డి మేలు




వర్షాకాలంలో పచ్చిమేత బురద తగిలి బాగుండదు. పచ్చి మేతపై ఒక రకమైన వాసన రావడం వలన పశువులు ఇష్టంగా తినవు. ఈ కాలంలో పశువులకు వరి గడ్డి బాగా ఉపయోగకరంగా ఉంటుంది. వరి గడ్డి తినే పశువులకు శరీర ఉష్ణోగ్రత పెరిగి, కడుపు నిండిన సంతృప్తిని పొందుతాయి. ఇక వైరస్‌లు, క్రిమి కీటకాలు పెరగకుండా పశువుల షెడ్లను, పశువులు సంచరించే ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంతో పశువులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

– డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్, పశు వైద్యాధికారి

రేపు వైఎస్సార్ సీపీ సమావేశం

లింగపాలెం: ఈ నెల 26న రంగాపురంలో లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తామని లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు రంగాపురంలోని వైఎస్సార్ సీపీ నేత రెడ్డిన శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు శాంతారావు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు పాల్గొంటారని ఆయన తెలిపారు. ముఖ్యంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీపై సమావేశం నిర్వహిస్తారన్నారు. కావున లింగపాలెం మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా శాంతారావు కోరారు.

కారుమూరిపై జనసేన కార్యకర్తల దాడి అమానుషం



బొడ్డు వెంకటేశ్వరరావు

చింతలపూడి: తణుకులో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కారుమూరి వెంకట నాగేశ్వరావుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతున్న కారుమూరిపై జనసేన కార్యకర్తలు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రచార రథం పైకి ఎక్కి జనసేన కార్యకర్తలు చేసిన వికృత చేష్టలు సభ్య సమాజం తల దించుకునేలా ఉన్నాయన్నారు. అధికారం నెత్తికెక్కి అహంకారం ప్రదర్శిస్తున్న నాయకులకు తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కక్షసాధింపుతోనే అక్రమ కేసులు

టి.నరసాపురం: వైఎస్సార్ సీపీపై కక్షసాధింపు కోసమే అక్రమ కేసులు పెడుతున్నారని స్వచ్ఛ సేవా చారిటబుల్ సంస్థ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పెండ్యాల అభిషేక్ బాబు అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టును గురువారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు.

అయ్యంకికి ఘన నివాళి

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ జిల్లా మాస్టర్ ట్రైనర్ డి.సత్యన్నారాయణ, గ్రంథాలయ అధికారి ఎస్‌సీహెచ్ రామకృష్ణలు రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు.

నేడు జీలుగుమిల్లిలో సీజీఆర్ఎఫ్

జంగారెడ్డిగూడెం: వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్), ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జులై 25న శుక్రవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జీలుగుమిల్లి సబ్ డివిజన్ కార్యాలయంలో నిర్వహిస్తామని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, ఎస్.రాజబాబు, ఎస్.మురళీకృష్ణ, ఎస్.సుబ్బారావు హాజరవుతారన్నారు.

రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం: ఈ నెల 25, 26 తేదీల్లో రెండు రోజులు జంగారెడ్డిగూడెం మండలం, నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో కట్టవపాదలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 ఫేజ్ 24 గంటల లైన్ వేసే నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కట్టవపాదలగూడెం, టెక్కినవారిగూడెం గ్రామాల్లో గృహ, వ్యవసాయ, కమర్షియల్ అన్ని రకాల సర్వీసులకు విద్యుతు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు చింతలపూడిలో..

చింతలపూడి: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25 శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చింతలపూడి మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇంజనీర్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులందరూ విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

'బాబూ' ఆడబిడ్డ నిధి ఎక్కడ?

- అబద్ధపు హామీలతో మహిళలను మోసం చేసిన చంద్రబాబు
- ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలి



కూటమి నాయకుల మోసాలను వివరిస్తున్న కంభ విజయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు

కామవరపుకోట: అధికార దాహంతో అబద్ధ హామీలు ఇచ్చి పాలను చేపట్టిన కూటమి నాయకులు ప్రజలను నిలువను మోసం చేశారని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. గురువారం మండలంలో సాగిపాడు గ్రామంలో మండల కన్వీనర్ రాయంకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకుల మోసాలపై గ్రామస్తులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో మొదటి హామీ ఆడబిడ్డ నిధిని అమలు చేయకుండా ఆడబిడ్డలను మోసం చేశారన్నారు. ప్రజలను మోసం చేయడంలో సీఎం చంద్రబాబు సిద్ధహస్తుడని ఎద్దేవా చేశారు. మ్యానిఫెస్టోకి హామీ ఇచ్చిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు మౌనవ్రతం చేయడం చాలా సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ ప్రజలకు గుర్తు చేస్తూ అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమమే ఈ బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అన్నారు. ప్రపంచంలోనే మ్యానిఫెస్టోను వందశాతం అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్ అని 50 శాతం కూడా అమలు చేయని వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. క్యూఆర్ కోడ్‌తో గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను చూపించి ప్రజలకు ప్రభుత్వం ఎంత బాకీ పడిందో వివరంగా చెప్పే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, వైస్ ఎంపీపీలు తమ్మిశెట్టి గిరిజా, కనికెళ్ల రత్నకుమారి, కో–అప్షన్ సభ్యులు ఎస్‌కే కరిముల్లా, ఎంపీటీసీలు బొల్లు వెంకట సత్యనారాయణ, బొప్పన చైతన్య కుమార్, బూరుగు శ్రీను, సొసైటీ మాజీ అధ్యక్షులు గుత్రాల రవికుమార్, టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, కొమ్మిన నరేష్, ఉప్పలపాటి మోహన్‌రావు, కీసరి రఘుపతిరెడ్డి, తక్కెళ్లపల్లి సాయి, చింతపల్లి సుధ, చింతలపూడి నియోజకవర్గ వికలాంగుల విభాగ అధ్యక్షులు చొక్కా నాగరాజు, బేతి నాగరాజు, గోగు గాబ్రియేలు, బేతి రాఘవ, ఏసుబాబు తాడేపల్లి ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆదాయ పన్ను దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం: ఛత్రపతి శివాజీ త్రిశత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన వాణిజ్య శాస్త్రం, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఆదాయ పన్ను దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు ఆచరణాత్మకమైన జ్ఞానం అవసరమన్నారు. దీని ద్వారా వ్యక్తిగత అభివృద్ధి, ఉద్యోగ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్న తణుకు డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కమర్షియల్ టాక్స్ కేఎస్ పద్మావతి ఆన్‌లైన్ పద్ధతి ద్వారా ఇన్‌కమ్ ట్యాక్స్ గురించి, జీఎస్టీ పద్ధతుల గురించి జీఎస్టీలో స్టేట్ పన్ను, సెంట్రల్ పన్ను, ఇంటిగ్రేటెడ్ పన్ను విధానాలను, కేస్ ఎగ్జాంపుల్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎం.మధు, అధ్యాపకులు కె.ఉత్తమసాగర్, సీహెచ్ రమాదేవి, కేవీవీ శిరీష, వి.హనుమంతరావు, జె.రాజాశ్రీకాంత్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణ మాసోత్సవాలు



నూకాలమ్మ ఆలయంలో శ్రావణ మాసోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో ఈ నెల 25 నుంచి ఆగస్టు 22 వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు సమాచారంతో కూడిన ఆహ్వాన పత్రాన్ని గురువారం ఉదయం ఆలయంలో కమిటీ ఆవిష్కరించింది. ఆలయ శాశ్వత ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ ఈ శ్రావణ మాసం ఐదు శుక్రవారాలు వచ్చిందని ఈ ఐదు వారాలు అమ్మవారు పలు అలంకరణల్లో భక్తులకు దర్శనం ఇస్తారని, మొదటి శుక్రవారం లక్ష పసుపు కొమ్ములు, తరువాత లక్ష గాజులు, మూడో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతం, సాయంత్రం 4 గంటల నుంచి 78వ చండీహోమం, నాలుగో శుక్రవారం పలు ఫలాలతో, ఆఖరి శుక్రవారం శ్రావణ అమావాస్య సందర్భంగా శాకంబరిగా అమ్మవారు దర్శనమిస్తారని, కాగా ఆగస్టు 6న మూలా నక్షత్రం పురస్కరించుకొని సామూహిక సరస్వతీ పూజలు చిన్నారుల చేతుల మీదుగా నిర్వహిస్తామని తెలిపారు. నూకాలమ్మ వైభవాన్ని కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్, శ్రావణమాస విశిష్టతను తిప్పా భట్ల వెంకట రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రొంగల నాగేశ్వరరావు, గాలి నూకరాజు, చిట్లూరి సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

కామవరపుకోట: వర్షాల నేపథ్యంలో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని తడికలపూడి ఎస్సై చెన్నారావు సూచించారు. గురువారం కామవరపుకోట దుర్గామహల్ సెంటర్‌లో పలు వాహనదారుల రికార్డులను పరిశీలించారు. వర్షాల నేపథ్యంలో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణాలు కొనసాగించాలనీ, రాత్రి సమయాల్లో వాహనదారులు తప్పనిసరిగా లైట్లు డిమాప్ చేయాలని సూచించారు.

ఆఖరి మజిలీకీ అంతరాయాలే..



శ్మశాన వాటికలో ఖనన గోతిలోకి చేరిన నీరు

కొయ్యలగూడెం: ఆఖరి మజిలీలోనూ అంతరాయం తప్పడం లేదని రాజవరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం మృతి చెందిన వ్యక్తి ఖనన కార్యక్రమం నిర్వహించడానికి దళిత శ్మశాన వాటికకు తీసుకెళ్లగా గొయ్యి తీసిన సమయంలో నీరు చేరిందని గ్రామస్తులు వాపోయారు. వర్షాలు కురిసినప్పుడల్లా బరియల్ గ్రౌండ్ ముంపునకు గురవుతుందన్నారు. శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య పేర్కొన్నారు. సరైన రహదారి లేక అనేక ఇబ్బందులు పడుతూ వర్షం కురిసినప్పుడు మోకాలి లోతు నీళ్లలో మృతదేహాలను ఖననం చేస్తున్నామన్నారు. దళిత శ్మశాన వాటికను ఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో అభివృద్ధి చేయమని కోరుతున్నా నిర్లక్ష్యానికి గురవుతున్నామన్నారు. అదే విధంగా మైనారిటీ వర్గాలకు చెందిన శ్మశాన భూమి సైతం అధ్వానంగా ఉందన్నారు. స్వచ్ఛందంగా డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ యువజన సంఘం శ్రమదానంతో శ్మశాన వాటిక అభివృద్ధి చేస్తున్నప్పటికీ ఆర్థిక వనరులు లేక పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



డీఎస్‌ఓ విలియమ్స్‌ను సత్కరిస్తున్న రేషన్ డీలర్ల సంఘ సభ్యులు

జంగారెడ్డిగూడెం: రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై ఉక్కు పాదం మోపుతామని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌ఓ విలియమ్స్ హెచ్చరించారు. గురువారం స్థానిక రోటరీ క్లబ్ భవనంలో జంగారెడ్డిగూడెం బుట్టాయిగూడెం, కొయ్యలగూడెం మండలాలకు చెందిన రేషన్ డీలర్లతో డీఎస్‌ఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 26 నుంచి 31వ తేదీ వరకు 65 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు, మంచానికి పరిమితమైన వారికి రేషన్ డీలర్లు సరుకులను ఇంటి వద్దనే అందజేస్తారని తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డీఎస్‌ఓ విలియమ్స్‌ను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో సీఎస్ డీటీలు వెంకటేశ్వరరావు, రామారావు, సీఎస్ ఆర్ఐ పద్మావతి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల రమేష్, అన్వర్ భాషా, డీలర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగించండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ

చింతలపూడి: సైబర్ నేరాలపై ఖాతాదారులకు అవగాహన కలిగించాలని సీఐ కె.క్రాంతికుమార్ బ్యాంక్ మేనేజర్లకు సూచించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ రవిచంద్ర ఆదేశాలపై స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సైబర్ నేరాలు, భద్రత అంశాలపై ఎస్సై సతీష్ కుమార్‌తో కలిసి బ్యాంక్ మేనేజర్లు, సిబ్బందికి గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ బ్యాంకర్లకు తగు సూచనలు చేశారు.

సేంద్రియ ఎరువులతో భూసారం మెండు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొయ్యలగూడెం: బోడిగూడెం గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కేఎస్ఎస్ పోశారావు కార్యక్రమంలో పాల్గొని సేంద్రియ ఎరువులతో భూసారం పెరగడంతో పాటు రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. సేంద్రియ ఎరువులు అనగా (బయో ఫెర్టిలైజర్స్) పాస్ఫో బ్యాక్టీరియా, కేఆర్‌బీ(పొటాషియం) తదితరాలు అన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం వలన పంటలకు నాణ్యత గల ఎరువులు అందుతాయని తెలిపారు. అలాగే రసాయనిక ఎరువులకు బదులుగా నానో యూరియా, నానో డీఏపీలను రైతులు క్రమక్రమంగా వాడడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులు పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని వరికి ఎకరాకు రూ.850, అలాగే మినుములకు రూ.300 చెల్లించాలని తెలిపారు. జులై 31వ తేదీ బీమాకు తుది గడువని తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిగ దిగుబడులు

ద్వారకాతిరుమల: ఆయిల్‌పామ్, అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిగ దిగుబడులు సాధించొచ్చని కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తి అన్నారు. మండలంలోని గుణ్ణంపల్లి, నారాయణపురం గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సార్వా, దాళ్వా సీజన్లలో వేసుకొనే వరి రకాల గురించి, ఆయిల్‌పామ్, అపరాలు పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి, పత్ర ఆకు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిన్నకేశవలు, ఉద్యాన అధికారి హరినాథ్, గ్రామ సహాయ అధికారి సుభాష్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి



సమావేశంలో పాల్గొన్న సీపీఐ నేతలు

చింతలపూడి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వామపక్ష ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్, రెడ్‌స్టార్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిరసనగా ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. వామపక్ష నేతలు కంచర్ల గురవయ్య, పి.పాండురంగారావు, ఆర్‌వీఎస్ సత్యనారాయణ, వరలక్ష్మి, తుర్లపాటి బాబు, ఎస్ సూర్యకుమార్, డి.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఉద్యమించాలి

బుట్టాయగూడెం: స్మార్ట్ మీటర్‌లకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక రామనరసయ్య భవనంలో ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం గురువారం కారం రాఘవ అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు తెల్లం రామకృష్ణ, తెల్లం మునీశ్వరరావు, సముద్రాల సుబ్బారావు, కట్టం వీరాస్వామి, మొడియం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

కొయ్యలగూడెం: స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నాపురం రోడ్డులోని సీపీఐ కార్యాలయం వద్ద గురువారం ప్రజా సంఘాల ఐక్య వేదిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, నాయకులు వి.సద్గురు, కురసం లత, పోరండ్ల శ్రీనివాస్, మడకం రామన్న, పులపాకుల దుర్గారావు, దుగ్గిరాల నారాయణరావు, గురుగుంట్ల ప్రసాద్, కె.ప్రసాద్, సత్తిబాబు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

శౌచాలయాల ప్రారంభం



నూకాలమ్మ ఆలయంలో శౌచాలయాలను ప్రారంభిస్తున్న దాతలు, ఆలయ కమిటీ ఛైర్మన్

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో గురువారం ఉదయం భక్తుల సౌకర్యార్థం మూడు లక్షలతో నిర్మించిన శౌచాలయాలు దాతల చేతుల మీదుగా ప్రారంభించారు. కలిదిండి వెంకటరాజు, జానకమ్మ దంపతుల జ్ఞాపకార్థం మనుమడు గొట్టుముక్కల వంశీ కుమార్‌రాజు, స్వాతి మణి, కొత్తపల్లి పృథ్వీరాజ్, మేఘన దంపతుల వ్యక్తిగత వితరణతో సౌచాలయాలను నిర్మించినట్లు ఆలయ శాశ్వత కమిటీ ఛైర్మన్ రాజాన పండు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రొంగల నాగేశ్వరరావు, గాలి నూకరాజు, చిట్లూరి సర్వేశ్వరరావు, నౌడు సత్య నూకరాజు పాల్గొన్నారు.